"నిజమే!" అన్నాడతను. "నేనా విషయమే ఆలోచించలేదు—కొంచెం ఆగు శకుంతలా!"

అక్కడ ఉండలేకపోయింది తాను—అతని నైర్మల్యం ముందు తన ప్రవర్తన నేరంగా కనిపించి నీచంగా అనిపించింది తనకి. కాని అదంతా నిజం-

"హృదయం ఉండాలి శకుంతలా—కాని, తలలో మెదడుకూడా ఉండాలి" అన్నది విశాల.

తన తల ఇప్పుడు బాగా పనిచేసిందనుకున్నది శకుంతల. అందంచేతనే, తనకి కన్నీళ్లు రాకూడదు.

వారం రోజుల తరవాత ఆయన కనిపించాడు మళ్ళీ...

"శారద చదువుకి వాళ్ళ తాతగారింటికి వెడుతుంది-ఆయనకీ ఎవ్వరూ లేరు-" అన్నాడు శ్రీపతి.

"వొద్దు—వొద్దు...నేను అన్నది తప్పు..."

"అది నిజం అని నాకు తెలుసును విశాలా... ఈ ఏర్పాటు అందరికీ బాగుంది. ఆయనకి మరి పిల్లలు లేరు. నాకు నువ్వు కావాలి. మనకి సుఖం కావాలి. ఈ సమస్యలు ఒక్కసారి పరిష్కరించేవి కావుగానీ, అనుక్షణం వాటితో బాధపడడం ఎందుకనీ?...నాకు నువ్వు కావాలి శకుంతలా!"

• • •

చంటివాడు ఏడుస్తున్నాడు.

ఆలోచనల్లోనించి ఇవతలికివొచ్చి వాడిని తీసుకున్నది శకుంతల. ఈ ఆరు నెలలనించీ, వాడు తెగ అల్లరి చేస్తున్నాడు. ఎత్తుకోడానికి పెట్టుకున్న పిల్లగోల పెట్టేలాగ.

సంతృప్తిగా నవ్వుకుంది శకుంతల.

"నువ్వు ఇంటికిపోవే—రాత్రి అయింది..."

పిల్లని పంపించి కొంతసేపు వాడిని ఎత్తుకుని అటూ ఇటూ పచారు చెయ్యసాగింది శకుంతల.

పెళ్ళి అయిన వెంటనే శారద తాతగారి ఇంటికి వెళ్ళిపోయింది. ఆ కొత్త రోజుల్లో తనకి అతనిలో ఏమార్పూ కనపడలేదు. నెలకొకసారి వెళ్ళి అమ్మాయిని చూసి వొచ్చేవాడతను.

ఇవాళ—ఈ ఉత్తరం...

• • •

నెమ్మదిగా కళ్ళువిప్పి చూసింది శకుంతల... ఉదయం తానెప్పుడూ ఆలస్యంగా లేవడమే... శ్రీపతి చీకటితోనే లేచి ఈసరికి రెండుసార్లు కాఫీ త్రాగి ఉంటాడు.

ఉయ్యాలలో పిల్లాడు నిద్రపోతున్నాడు. శ్రీపతి అటువైపు తిరిగి వాడివంక ఆదేపనిగా చూస్తున్నాడు.

అట్లానే చూడసాగింది—శకుంతల.

అతను ఒక చెయ్యి ఉయ్యాలలో పెట్టి నెమ్మదిగా వాడికి మెలకువ తెప్పించడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆమె లేవడం, బయటికి వెళ్ళడం, అతనికి తెలీదు—ఆమె తిరిగి లోపలికి వొచ్చేసరికి, వాడు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు.

శ్రీపతి రేడియో పెట్టేడు.

నవ్వుకుని, కొడుకుని చేతుల్లోకి తీసుకుంది శకుంతల.

• • •

"శారదకి జవాబు వ్రాశారా?"

ఈ రెండురోజులూ అతనా ప్రసక్తి తేలేదు—ఏమీ జరగనట్టే ఊరుకున్నారు ఇద్దరూ. 'లేదు' పేపరు తిరగవేస్తూ అన్నాడు శ్రీపతి "రేపు నేనే వెళ్తానుగా! నాలుగురోజులు..."

అతను తల ఎత్తలేదు.

"అలాగ కాదు. ఈసారి రమ్మని రాయండి... ఉత్తరం అలాగ రాసింది..."

కొంచెం ఊరుకుని "నీకు తెలుసును శకుంతలా. శారదవొస్తే దాన్ని బాధపెట్టడమే అవుతుంది... ఇన్నాళ్ళనించీ దానికొక రకం జీవితం అలవాటయిపోయింది. అలాగే సాగనీ...నా కోసమని నువ్వు నీ అభిప్రాయం మార్చుకోనక్కరలేదు" అన్నాడు శ్రీపతి.

చిన్నగా నవ్వి, "అదేంకాదు లెండి—రమ్మని రాయండి. మీరు వెళ్ళి తీసుకురండి..." అన్నది శకుంతల.

పేపరు క్రిందపెట్టి, సూటిగా ఆమె కళ్ళలోకి చూస్తూ, "ఉన్న విషయం మన ఇద్దరికీ తెలుసును శకుంతలా! మనం ఈ పరిస్థితికి అంగీకరించుకున్నాం ఇప్పుడు క్రొత్తగా ఏమీ వొద్దు" అన్నాడు శ్రీపతి.

శకుంతల కొంచెం ఊరుకుని, "నాకు శారదని చూడాలని ఉంది. తీసుకురండి" అన్నది.

